

# నరజన్మమిక దుర్లభమురా

సచ్చిదానంద యోగి తన ఆశ్రమంలో, పొద్దునా, సాయంత్రంతత్త్వాలు, శంకరుని భజగోవిందం పాడే పద్ధతి పెట్టాడు. తత్త్వాలు తెలుగులో వుంటే, సంస్కృత భాషలో వున్న భజగోవింద శ్లోకాలు గూడా తత్త్వాలే అంటాడాయన. తత్త్వాలలో, బోధా, హాస్యం, విజ్ఞానం ప్రపంచ జ్ఞానం, దైవతత్త్వం, వేదాంతం దాగి వున్నాయంటాడు యోగి. ఆ తత్త్వ చింతనలో యెవరూ పాల్గొనక పోయినా తానొక్కడే కూచుని, ఏక్తారా మీటుతూ, చిరతలు వాయిస్తూ పాడుతాడు. వేమన యోగి పద్యాలలోనూ తత్త్వమున్నదని అవీ పాడతాడు యోగి. అన్నమయ్య కీర్తనలు భక్తియుతమైనా, ఏకేశ్వరోపాసనా భక్తీ చెప్తాయి. పోతులూరి వీరబ్రహ్మేంద్రం గారివీ, అచలమతం లోనివీ యోగం నేర్పుతాయి. అయిదు గొఱ్ఱెలు పులిని తింటాయి. వింత గాదా నాయనా అంటాడు బ్రహ్మంగారు. నక్క యొక్కటి యుండెరా, కుక్కలను యెగదోలెరా, చిక్కులేక చిన్న మకరిని నిక్కువమ్ముగ మింగెరా. విర్రవీగుచు కేక వేయుచు, యీగ మంచము మింగెరా' అని తత్త్వం. చిన్నమకరి అంటే అంతరాత్మ. అది ఘోషపెడుతూనే వుంటుంది. వంచన చేసి దాచలేవు. దేవుని కన్ను మూయలేవు. యెన్ని విషయాలు పైకి వచ్చినాయి అమాయకుడా! యోగమంటే సహజ సౌమ్యతను కోల్పోక వుండటమే. అచలతత్త్వమూ అదే అంటుంది. ముష్టికెళ్తావు. ఒక్కోరోజు ముష్టిరాలదు. అంతమాత్రాన ఆకలికి లొంగి దూషణకు దిగకు. ఉరమున తంబుర మీటుచు 'నేటి కింతి యేయని' గురువు నన్ను పరీక్షించటానికి గుప్పెడు మెతుకులు రాల్చక నవ్వుతూ చూస్తున్నాడు బ్రహ్మో సమాజ్ ''మెతుల కొరకిచ్చిక మేటికి? నిను సేవింపని పుట్టున దేటికి'' అంటుంది. నర్సీ మెహతా వైష్ణవ జనతోతెనే కహియే. జోపీడ పరాయీ ఆణెరే కోయీ. పరదుఃఖే వుపకార కరే కోయి। మన అభిమాన జాణెరే కోయీ।'' అంటూ శ్యామలియాని నమ్ముతాడు. భర్తృహరి శ్లోకాలు గానం చేస్తాడు యోగి కొలిమికి రెండు తిత్తులుంటాయి. అవి ఆడుతుంటే అగ్ని రగిలి యినుము, లోహాలూ కాలి, సమ్మెట పోట్లతో వుపయోగకరమైన వస్తువులు తయారౌతాయి.

అలాగే మన వూపిరితిత్తులు ఆడుతుంటే జీవశక్తి కొలిమిలాగా వెలుగుతుంటే ఒడిదుడుకులనే సమ్మెట పెట్టతో జ్ఞానం తయారౌతుంది. జీవుడు వుపకారి అవుతాడు అని తత్త్వం. దూదేకుల కులంవాడైన గురువు దూదియేకినట్టు జీవితాన్నీ ప్రపంచాన్నీ యేకితే గింజలు పోయి దూది శుభ్రపడి పింజలుగా అయి తెల్లగా అయి, పరుపు కుట్టటానికి అనువుగా అవుతుంది. ఆ కుట్టిన పరుపు మీద శయనిస్తే మంచి నిద్రపడుతుంది. అలాగే చెడును తోలివేసి మంచిని దయనూ వాడుతూ జీవితమనే పక్క తయారుచేస్తే, వృద్ధాప్యంలో సుఖమూ శాంతీ గలిగి నిశ్చింత లభిస్తుంది. మరొకతత్త్వం నవ్విస్తుంది. యెక్కడనించి వచ్చాము? నీటిబుడ్డ దాటి వచ్చాము.

ప్రహ్లాదుడు, ''తొమ్మిది రంధ్రాలుగల యీ గోడ లేదా కుండలో దీపం యెవరు వెలిగిస్తున్నారు? ఆ దీపం యెటునించైనా పోవచ్చు. అక్కడే వుండటమే ఆశ్చర్యం. యెవరుంచుతున్నారు? అన్నాడట''.

యోగి స్ఫురద్రూపి. రకరకాలుగా చెప్పుకుంటారు.

''బాల్యంలోనే యోగి యెలా అయినాడో! యే యోగం నేర్చాడో! బాలునిలాగే నిష్కల్మషంగా నవ్వుతాడు'' అంటాడా వృద్ధు. ఆయనకే యోగి వయస్సు అంతుబట్టక అడిగాడు. ''యెన్నేళ్ళు యోగీ బాల్యం దాటనట్టు కనబడతావేం?''.

యోగి నవ్వుతూ, ''తిరుపతి వెంకన్నను దర్శిస్తే మనిషికో రకంగా కనబడతాడట. తనంత యెత్తే వున్నట్టు కొందరికి. చాలా వున్నతుడైనట్టు మరికొందరికీ. అంతా మన మనసులో వున్నది. హరియే మనలో వున్నాడని మంత్రశాస్త్రం చెపుతుంది. కోపమొస్తే కటువు మాటలు గదలాగా వాడతామట. చక్రం వాడినట్టు అడ్డువేసి కష్టం తొలగించగలమట. పనికాకుండా అడ్డా పడతామట. అలా 'కంటిలోన నున్న కనుపాపరీతిగా దేవుడుండు యీ దేహిలోన' అని మరొక తత్త్వవేత్త అన్నాడు. అవిద్య అంటే తాను వేరు దైవము వేరు అనుకోటమే అని అంటారు. క్షేత్రయ్య పదాలు అల్లీ అల్లీ నీవు వేరు నేను

వేరూ అంటావెందుకు? ఆ మాయ తీసేయి అని నాయిక అంటుందిట. ''మరి అనుభవశాలిలాగా, వృద్ధులాగా, మాట్లాడుతావే'' యోగికి మెస్మరిజం, హిప్నాటిజం, వశీకరణం, కుండలినీ, పరకాయ ప్రవేశం, రాజయోగం, హఠయోగం వంటివి గూడా వచ్చు అంటారు అనుయాయులు ఆశ్రితులు.

ఒక్కో రోజు ఆశ్రమం కిటకిటలాడుతుంది. మరో రోజు ఒక్కడే ఆశ్రితుడు కూచుని తత్త్వాలు వింటూ కనబడుతాడు.

ఓ సందేహ నివృత్తికే కాదు. ఆపద తప్పించమనే కాదు, వ్యాధి కుదర్చమనే వారు, పగతీరాలని మార్గమడిగే వారు, తమ గుట్టు రట్టు కాకూడదనే వారు, క్రైసిస్ దాటాలని వచ్చేవారూ, సంసారంలోని చిక్కులు తీర్చమనేవారు, సలహా కోసం వచ్చేవారూ వస్తూ వుంటారు. యోగి చెవి యొగ్గి విని, ఆదరిస్తాడు. భాషాభేదం అడ్డురాదు. ప్రాంతీయ భేదం అసలే లేదు, మత కుల వయోభేదమూ లేవు సరిగదా. లింగభేదమూ లేదు.

కలగాపులగంగా వున్న వేదాలను వ్యాసమహర్షి విభజించి మానవులకు వుపకారం చేశాడు. అయనకు ముందు వేదాలు మూడే త్రయీ అనేవారు. ఋక్, యజు, సామ. మొదటిది దైవాన్ని సూక్ష్మంగా ఉదహరిస్తూ యిలా వుంటావు అని ఋక్కులు. రెండోది కర్మకాండల ప్రొసీజర్ మరియు ఫలితాలు. మూడవది గానము. మహర్షి అధర్వణ అనే వేదం కలిపి వేదాలు నాల్గు అన్నాడు. ఫిజియాలజీ రుగ్మతలు, వాటిని నయం చేయటం అనుష్ఠానాలు. మంత్రము యోగము కలిసి జీవుని ఆరోగ్యవంతునీ, జ్ఞానినీ చేయటం.

సరీగ్గా యిదే పద్ధతిలో కలగాపులగంగా వున్న రాగాలను కీర్తనలను వీణ వెంకటముఖి అనే యోగి పరిశోధించి డెబ్బై రెండు మేళకర్తలని, ముప్ఫై ఆరు శుద్ధ మధ్యమరాగాలనీ, ముప్ఫై ఆరు ప్రతి మధ్యమ రాగాలని విభజించాడు. సప్త స్వరాలున్నవి జనక రాగాలు, వాటిని పోలివుండి మార్పు పొందినవి జన్యరాగాలు. ఆరోహణ అవరోహణ షాడవ, ఔడవ, సంపూర్ణ, సంకీర్ణ అతా ఘనరాగాలు రక్తి రాగాలు, మిశ్ర రాగాలు అని వివరించి సంగీతాన్ని పటిష్టం చేసి'', యింక యీ పద్ధతినెవరూ మార్చలేరు. వింటూనే రాగం పేరు చెప్పగలరు''

అని బ్రహ్మానందం పొందటమే గాక, వీణనూ పటిష్టం చేశాడు వెంకటముఖి. లోహపు మెట్లు అరిగిపోయే అవకాశమున్నది. ధ్వనిని వైబ్రేట్ చేయలేవనీ కనిబెట్టి, అప్పుడు వ్యాప్తిలో వుండి లభ్యమౌతున్న గాజుగొట్టాలు గట్టివి, లోపల బోలుంటుంది. యేరి కోసి వీణకు మెట్లుగా అమర్చాడు. చాలా గట్టి గనక అరిగిపోవు. రంధ్రం గుండా ధ్వని వైబ్రేట్ అయి దూరానికి వినిపిస్తుంది. వెంకటముఖి వీణను నించోబెట్టి వాయించే వాడు. తోటి పండితులు అంత ధ్వని దూరానికి వినబడటం తెలిసి ''అద్భుతం'' అన్నారు.

సరీగ్గా అలాగే యోగి పరిశీలన చేసే మనుషులను విభజించాడు. తెలిసి తప్పు చేసేవారు, తెలియక చేసే వారు పిల్లి కుండలో తలదూర్చి పాలుతాగుతూ తననెవరూ చూడటం లేదనుకుంటుందిట. సరీగ్గా అదేతత్త్వం మనుషులకూ, కొంతమంది పార్టీ ఫిరాయించినట్టు ఫిరాయింపులూ, మరికొందరు ఊసరవెల్లిలాగా రంగులు మార్చటం, దేవుని కన్ను మూయగలం అనుకునే వారూ, కుక్క తోకలాంటి బుద్ధిగల వారు వున్నారు.

యోగి ఆనాడు పొద్దున ''నరజన్మమిక దుర్లభమురా, సాజన్మ సాకార సద్గురూ గనరా, యీ జన్మమిక దుర్లభమురా'' అని పాడుతున్నాడు.

కూచుని వింటున్న అనుయాయి సిద్దప్ప అడిగాడు ''సద్గురువును గుర్తించటమెలా గురూ! వేషం వేసినంత మాత్రాన గురువు కాడుకదా? అసలు గురు శబ్దానికి అర్ధమేమిటి''.

''చక్కని ప్రశ్న వేయటానిక్కూడా తెలివి కావాలన్నాడు పరమహంస. బాగా అడిగావు. గురు అన్నా సద్గురు అన్నా దైవం. ఆపదలో '' ఓయి సద్గురూ నీ దయ యిలా వచ్చిందా?'' అంటాడు రామదాసు అనే హీరో 'మాలపల్లి' అనే నవలలో. తన కులానికి గౌరవమూ తిండీ బట్టా అందాలని దాసు అనే పెద్దకొడుకు వుద్యమం లేవదీస్తే భూస్వామి రాగాలతో చంపాడు ''మనమే గెలుస్తాం'' అంటూ కన్ను మూశాడు దాసు. వేషం వేసినా గురువు కాలేడు. ఫాదరీ మత బోధ చేస్తాడు. చాప్లిన్ అనే నటుడు ఖండాంతరాలలో గూడా ఖ్యాతి కెక్కాడు. ధనార్జన చేశాడు. ఆ నటుని బాల్యంలో దారిద్ర్యం కాటకం

చూశాడు. తల్లీదండ్రీ స్టేజ్ యాక్టర్స్. తగినంత ఆదాయం లేక కష్టాలకూ దారిద్ర్యానికి తట్టుకోలేక తాగుడు వ్యసనపరుడై, భార్యా యిద్దరు కొడుకులను వదలి వేరే స్త్రీతో వుంటూ జబ్బుపడ్డాడు. భార్యా వచ్చి ఓదార్చింది. ''మనం ఆఫ్రికా వెళ్దాం. అక్కడ నైట్ క్లబ్స్‌లో స్టేజ్ యాక్టర్సుని ఆదరిస్తున్నారు. మంచి జీతం. బాగా సంపాయించుకుని సుఖంగా వుందాము'' అన్నాడు. భార్యా ''అలాగే వెళ్దాం. సుఖంగా వుందాం'' అన్నదిట. తర్వాత కొడుకులు వచ్చి చూశారు చెట్టునానుకుని కూర్చుని వున్న తండ్రిని. వాళ్లనూ ఓదార్చాడు. ఒక ఫాదరీ అటుగా వచ్చి చాప్లిన్ తండ్రినీ వాని హీనస్థితిని చూసి ''సోసోయత్ సోరీపెత్'' అని బైబిల్లో వాక్యం వల్లించాడు. వాడి గతం నడవడీ గుర్తు చేసి చెప్పాడన్న మాట. పిల్లలు తల్లి దగ్గర కెళ్లారు. చిన్నకొడుకు, ఫాదరీ యిట్లా అన్నాడని తల్లితో చెప్పాడు.

''అయ్యో! జబ్బుపడి నేడో రేపో యీ లోకం వదలి వెళ్లిపోయేట్టున్న వాడి నలాగేనా వూరడించటం. సింపతీ చూపితే యేమీ పోదే!'' అని దుఃఖించిందిట తల్లి. సిద్దప్పా! ఆ తల్లే నిజమైన మతగురువు. వేషం వేయకపోతేనేం'' అని చెప్తున్నాడు యోగి.

శంకరం అనే సనాతన వేషధారి, కర్మిష్ఠి వచ్చాడు. బాషిపీట వేసుక్కూచున్నాడు విభూతి, కుంకుమ, పైబట్టా బాగున్నాయి. బిళ్ల గోచీ ''యేమిటి నీ గొప్ప. చాలా మంది నాకర్షిస్తూ, చాలా సంపాయిస్తూ, నిర్మోహిలాగా, నిరాడంబరునిలాగా కనబడుతున్నావు. త్రికాలవేత్తవంటున్నారు. ఈ ఒక్క దానికీ సమాధానం చెప్పు. పోవాలి. పని వదిలి వచ్చాను'' అంటున్నాడు. యోగి ఏకాగ్రా, చిరతలు కిందవుంచి అతనినే చూస్తూ ''వింటున్నా'' అన్నట్టు తలవూపుతున్నాడు.

''తల్లి శతవృద్ధు. కన్నబిడ్డలు వదిలేసి పోగా, ఆమె కన్నబిడ్డను నేనొక్కడినే ఆమెను వదిలి వెళ్లక కనిబెట్టుకుని వుండి, సకలోపచారాలూ, చేస్తూ, రుచిగా వండి, ఆమె చేత తినిపించి, చేయీ మూతీ కడిగి, కర్ర అందించి, బెడ్ మీదుంచి నిద్రపెట్టే దాకా విసిరేవాడిని. నేల శుద్ధి చేసి విస్తరి పారేసి వచ్చి చేతులు కడుక్కుని

నేను భుజించేవాడిని. విరామ సమయంలోను, తల్లి నిద్రబోతున్నప్పుడు, కాలం వ్యర్థం చేయక అథర్వణం గీతా తెలుగులోకి తర్జుమా చేశాను. తల్లి స్వర్గస్తురాలయాక, యధావిధిగా మాతృ యజ్ఞం చేసి మాతృ ఋణం తీర్చుకున్నాను. అయినా తల్లి పోగానే పెన్నీలెస్ యెందుకయాను? యేమిటీ విచిత్రం!''.

''అవన్నీ చేసేప్పుడు, సుఖశాంతులూ, తిండీ విశ్రాంతీ వున్నాయే''.

''అదిగాదు నా ప్రశ్నకు జవాబు తవ్వి తలకెత్తిదెప్పుతావాయేం? తప్పులెన్నువారు తండోపతండంబు లుర్వీజనులకెల్ల వుండు తప్పు. ఒక్క ముక్కలో చెప్పగలవా లేదా?''

''మూర్ఖుడరయలేడు ముప్పదేండ్లకునైన'' అన్నాడు యోగి. శంకరం ఒక్క వుదుటున లేచి మిత్రి చూసి వెళ్లిపోయాడు.

సిద్ధప్పకేమీ అర్థంగాక శంకరం వెళ్లిన వేపే చూస్తుండగా, భక్తులూ, సందేహ నివృత్తి చేసుకోగోరేవారూ, పృచ్ఛకులు రాసాగారు. దర్శనం కోసమే వచ్చేవారూ, పాద ధూళి నెత్తిన చల్లుకు పోదామనుకునేవారూ తాము తెచ్చినవి అక్కడుంచారు.

ఒక పూర్వసువాసిని కౌమారం దాటినామె, సనాతనిస్టు మేకప్ చేసుకుని వచ్చింది ఆమె గొప్ప వ్యవహర్త అనీ వస్తూ వుంటుందనీ యోగికి గుర్తు. నవ్వుతూ అన్నాడు.

''కూచోండి మాతాజీ! యేమిటి విశేషం? సాయపడాలా సంశయ నివృ త్తి చేయాలా? భవిష్యత్ సూచించాలా?''

తనకు కావాల్సిన అంశమే అందుకున్నది పూర్వ సువాసిని.

''యెంత సమర్థతతో నిర్వహించుకొస్తున్నా, కష్టదశ వదలదు. క్రైసిస్ తరచూ యెందుకొస్తుంది? మనశ్శాంతి నెందుకు పాడుచేస్తుంది తెలుసుకోవాలని వచ్చాను. రెండోది, నేను పనిమీద వెళ్తున్నాను''. కనుబొమల మధ్య కదుల్తూ వుంటుంది చర్మం. ముక్కు నలుపుకుంటుంది. గూడెగరేసి

పమిట దిద్దుకుంటుంది. కూచోదు.

''మాతా మీరు వేత్త. తెలిసే నా చేత చెప్పించాలని అడుగుతున్నారేమో. చెప్తాను. కాని బాగా హర్ట్ చేస్తాను. విధిలేక చెప్తున్నాను. నిష్కామకర్మ తలపెట్టనన్నాళ్లూ మీరు పేర్కొన్నవి వెంటాడుతాయి. గీతలోవి ఉటంకిస్తారు. కాని మాఫలేషు కదాచన అమలు చేయరు. మీకు సానుకూలత అందదు'' అన్నాడు. వేత్త అవమానాన్నే కేర్ చేయదు. యోగి కటు వచనాలసలే ఆమె చెవిలో దూరవు. ''యెందుకని సానుకూలంగాదు? తగినంత లాభం చూపిస్తానే'' కత్తులు గుచ్చుతున్నట్టున్నది చూపు. ముక్కు నలుపుకుని గూడెగరేసింది.

యోగి తొణక్కుండా అన్నాడు. ''అది గూడా నా చేతే చెప్పించాలనా మాతాజీ? రాబందు స్టైల్ మీది. నీనా అనే భేదం లేదు. అయినా తల్లి అనే మోహంలో వున్నారు సంతానం. యే సంతానం వద్దకు యేం పనిమీద వెళ్తున్నారో, ఆ సంతానం అనుభవం మీద గ్రహించి గూడా మిన్నకున్నది. తెలివితక్కువదని చూసి మీ స్టైల్ మీరే ప్రూవ్ చేశారు మాతాజీ. డబ్బు డిమాండ్ చేయటం, రాలేదాకా తిట్టటం లేదా యెవర్నన్నా అక్కడ దిగవిడిచి వెళ్లిపోవటం గుర్తుండే దాకా ప్రూవ్ చేశారు మాతాజీ, యెదురుగా గోడ మీద కూచుని కాకి బాగా అరిస్తే మీరొస్తున్నారని గుర్తు, మొదలు పెట్టిన యిల్లు పూర్తికాక భర్త భార్యకేమీ అందించటం లేదు. లబలబలాడితే కళ్లప్పగిస్తుందిప్పుడు. కలకలా నవ్వితే వింటుంది. రిక్తహస్తాలు గనక అన్నిటికీ సిద్ధంగా వున్నదా సంతానం. పొదుపు వుద్యమం, అమలు జరుపుతున్నారిద్దరూ. ఒక్క పొద్దుంటున్నారు. ఇంటి మెటీరియల్‌కి యిద్దరూ తెల్లార్లూ కాపలా కాస్తున్నారు. మీ తలలో తొలిచేది పురుగు, యెవరి వద్దయినా డబ్బు చేరితే అదంతా లాగేయమని ఆ పురుగు తొలవటం మొదలెడుతుంది. నరజన్మమిక దుర్లభమురా సహజన్మ సహకారసద్దురూ గనరా అనే తత్త్వంతో ఆ పురుగును తొలగించుకోవాలి మాతాజీ'' అని యేక్తారా చిరతలు అందుకుని పాడసాగాడు యోగి.

అక్కడ నిండిపోయిన జనుల యెదుట యోగినేమనటానికి నోరుపెగలక

చిటచిటలాడుతూ పళ్లుపటపటలాడిస్తూ నిర్గమించింది పూర్వ సువాసిని.

కొంతమంది వినోదించి లేచి లోపలికెళ్లి అంతా శుభ్రం చేసి వంట మొదలెట్టారు.

కర్రపోటు వేసుకుంటూ ఒక శతవృద్ధు వచ్చి కూచుంటూ అడిగాడు ''క్షేమమా యోగీ?''

యోగి అహ్లాదకరంగా నవ్వి యేక్తారా కిందివుంచి అన్నాడు.

''తాతా! శవపేటిక మోస్తున్నవారు ఒక్కొక్క అడుగు ముందుకేస్తుంటే, గోయి దగ్గరౌతున్నట్టు, ఒక్కొక్క రోజు గడుస్తుంటే మృత్యువుకి దగ్గరౌతాము. సేమమా అంటే యేమి చెప్పాలీ అన్నాడో కవి. ఒక్కనాడూ నరజన్మమిక దుర్లభము సార్థకం చేసుకుంటున్నావా అనరు తాతా. జుట్టు వూడినా, పళ్లూడినా కళ్లు కపనడక పోయినా వాంఛ వూడదు. గురువును గుర్తించే మేధస్సు ఒక్క మనిషికే వున్నది. వానికే అవసరం గూడాను. తక్కిన జీవులు పుట్టుచు చచ్చుచున్ అన్నట్లుంటాయి''

''అది వినటానికే వచ్చా యోగీ'' అని నవ్వాడు వృద్ధు.

ఒక పండితుడొచ్చి వృద్ధు పక్కన కూచున్నాడు. నలభై అయిదేళ్లుంటాయి. బక్క పలచగా తెల్లగా వున్నాడు. శ్రోత్రియుని మేకప్. దణ్ణం పెట్టాడు. యోగి గమనించాడా పండితుడిని.

''నేను సామన్యుడినే పండిట్‌జీ. మీ దణ్ణం గురువుకి చెందుగాక'' యేమిటి బాధ అన్నట్టు చూశాడు యోగి.

దణ్ణం తీసేయకుండానే చెప్పుకెళ్లాడు పండితుడు.

''యేదో నలత. యేదో వ్యాధి పీడిస్తున్నది. నేను పరిశోధకుడనూ, ఉపాధ్యాయుడిని. కుటుంబమున్నది. యే వైద్యము యీ శరీరానికి స్వస్థత నీయటం లేదు. దైవం పిలిస్తే బాగుండుననిపిస్తుంది. శివ అనే మిత్రుడు చూడవచ్చాడు. ''మిత్రమా! విరక్తి చెందకు. సచ్చిదానంద యోగి నిన్ను స్వస్థుని

చేయగలరు. నేనుత్తరమిస్తాను. నమ్మకముంచు. నిన్ను స్వస్థుని చేయటమేగాక, నీ పరిశోధన పూర్తి అయేట్టు చేయగలరు'' అని మీ స్థావరం చిరునామా యిచ్చి పంపాడు శివ. ఇదుగో లేఖ'' అని అందించాడు పండితుడు.

''భోజనం వేళైంది. స్నానం చేసి ఆత్మారాముని భోజనంతో పూజించండి పండిట్‌జీ. మీకు విశ్రాంతి కరవైంది. అది జీవునికి చాలా అవసరం. బడలిక పైకే కనబడుతున్నది. బహుశా వర్క్ హాలిక్ అయివుండాలి. కళ్లు తేలిపోతూ, నోరెండి తూలుతూ వచ్చారు. చూచాను''.

తాను లేచి సాదరంగా పండితుని చేయూత యిచ్చి లేవదీసి తీసికెళ్లాడు యోగి. తాతా అనుసరించాడు. వాళ్లిద్దర్నీ లోపలున్న భక్తుల కప్పగించి, తిరిగి వచ్చేప్పటికి, ముగ్గురు యువకులు నిలబడివుండి వందనం చేశారు.

ఒక పక్కగా ఒక రూపసి కూచుని వున్నది. అమె పక్కగా అమె తండ్రీ. ఒక పళ్ల బుట్ట, అరిటాకుల విస్తళ్ళ కట్టలు నాలుగు చిక్కం కట్టి మూత వున్న నేతి తపేలా, చిక్కం కట్టివున్న పెరుగు గిన్నె వున్నాయి. వారిద్దరూ లేచి వాటిని తెచ్చి ''లోపల పెడ్తాము యోగీ!'' అని తీసికెళ్లి లోపలపెట్టి వచ్చారు. మళ్లా పక్కగా కూచున్నారు.

'' అటే టైం వేస్ట్ చేయం యోగీ! యెన్ని సార్లు అప్పియర్రైనా మేమిద్దరమెందుకు పరీక్ష నెగ్గటం లేదు? లోపమెక్కడున్నదో తెలుసుకోగోరి వచ్చాము'' అన్నారిద్దరు యువకులు.

''హాస్యయుతంగా చెప్పాలా! మొరటుగా చెప్పాలా?'' అనడిగాడు యోగి నవ్వుతూ. వారిని స్టడీ చేస్తున్నాడు.

''యెలాగైనా పర్వాలేదు. లోపం తెలుస్తుంది.'' అన్నారు.

ఆ ముగ్గురిలో పెద్దవానికి చిక్కని మీసకట్టు. దానిలో వేలుదూర్చి గోక్కుంటూ నించున్నాడు. తక్కిన ఇద్దరూ చేతులు కట్టుకు నిలబడే వున్నారు.

''నాకు హాస్యమే యిష్టం. అది టికిలిష్‌గా వుండి సత్యం చెప్పాలి. మీరిద్దరు

బైబర్త్ నటులు. చదువుతున్నట్టు నటిస్తూ తండ్రిని నమ్మిస్తున్నారంతే. ఛోంచేసి ఆఫీసుకెప్పుడెళ్తాడా అని యెదురు చూస్తూ పక్కచూపులు చూస్తూ, చిత్తం శివుని మీదా బుద్ధి చెప్పుల మీదా అన్నట్లు బీడీలు సిగరెట్లు పీలుస్తూ యెంజాయ్ చేసే టైమేదీ? అని వర్రీ అవుతూ, తండ్రి పైసారాల్చాలనే వుద్దేశంతో నాన్న వున్నంతసేపూ చదువుతున్నట్టన్నా కనిపిద్దాం అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ పుస్తకాలు ఓపెన్ చేసి పట్టుకునీ, లెక్కలు చేస్తున్నట్టు అభినయిస్తూ ప్రాక్టికల్సు చేస్తున్నారు. చీకూ చింతా లేదు. టైమ్, మానవజన్మల, విలువ తెలియదు. వేళకన్నీ అందిస్తూ అమిర్చిపెట్టే నాయనమ్మా! రాత్రి పొద్దుబోయి వచ్చినా మేలుకునే వుండి భోజనం పెట్టే తల్లీ వున్నారు. అజమాయిషీ లేదు. కాలర్ ఎగరేసుకుంటూ బలాదూర్ తిరగటంలో లభిస్తోంది ఆనందం. సినిమా చూసొచ్చి పొయిగడ్డల్లాకూచుని వూసులాడాలి. స్నేహితులతో కలిసి లైబ్రరీ కెళ్లామని కల్లలాడటంలో వుంది విలువంతా. తనకే లోబడివుండి తాను చెప్పినట్లు నడుచుకుంటే సచ్ఛీలురూ ఆచారవంతులూ అవుతారని నాయనమ్మ ఐడియా. ట్యూషన్ పెడితే యెగ్గొడుతున్నారని తన బిడ్డలు బాగా పెరుగుతున్నారనే మాయలో వున్న తండ్రి కెలా తెలిసింది? ఆ ట్యూటరు ట్యూషన్ ఫీస్ రిటరన్ చేశాక తెలిసింది. తక్కిన జీవులకి చదువు కోవాల్సిన బాధా లేదు. అవసరమూ లేదు. వాటి మొహానేమున్నదో అదే చేస్తాయి. యెద్దు బండి లాగును, పొలము దున్నును. ఆవుపాలు యిచ్చును. గడ్డి మేయును. గురువును గుర్తించగలిగే మెదడు నరునకే వున్నది. అలాగే వుండి పోక్కర్లేదు. బాగుపడచ్చు. మారచ్చు. దేరీజ్ స్టిల్ టైమ్. మేజర్లై తండ్రి మీద ఆధారపడటం, ఆస్తి వుందని బేపర్వా. సహకార సత్యమే కనరా నరజన్మ దుర్లభమురా'' అని అందుకోగానే యిద్దరు యువకులు వెళ్లిపోయారు.

''నీ వుండిపోయావేం మిత్రమా?'' అన్నాడు యోగి.

''వాళ్ల కొచ్చిన సందేహమే నాదీనూ. చెప్పేశారుగా సరిపోయింది. మరొక చిన్న సందేహం తీర్చుకుందామని వున్నాను. సంపదెందుకు తరుగుతుంది? యెందుకు పెరగదు? కొంతమంది వన్నాఫ్ ది రిచెస్ట్ అవుతుంటే మరొకడు పాపర్

అవుతున్నాడు. అందలి రహస్యమేమిటి?'' అన్నాడు మొదటివాడు వేలు మీసంలోనే తిరుగుతున్నది.

'' ఓహో! ఆ రహస్యం వెల్లడించాలా మిత్రమా! నీకు ధ్యాస చదువు మీద కన్న యెవరిని యిరిటేట్ చేద్దాము, యెవరిమీద అపనింద లేద్దామనే వున్నది. ఆరాటం పాఠ్యాంశం మీద గాదు లొసుగులు తెలుసుకుని గేలి చేయటమ్మీదున్నది. చదువెలా వస్తుంది! డిగ్రీ కూడా వస్తుంది. కానీ అంటించినట్లు మాట్లాడితే వచ్చే ఆనందం సబ్జెక్ట్ చదివితే రావటం లేదు. క్రిందటి తరం వారు అహం అసూయ లొంగ తీయగా నువ్వెంతంటే నువ్వెంతని, కావేషాలు పెంచుకుని వెలివేసుకున్నారు. నేడు మంచి అవకాశం అందగానే, ''మేము అనాచార వంతులమనీ, అవినీతి పరులమనీ వెలివేస్తిరే! ఇప్పుడు బావుందా? ఐపి దాఖల్ చేసి మంచి పేరూ ప్రఖ్యాతీ పొందావు! సుపుత్రా కొంప పీకరా అన్నట్టు నీ సుపుత్రుడు సంఘాన్నీ సమాజాన్నీ ఆ మాటకొస్తే శాస్త్రాన్నీ కులాన్నీ మతాన్నీ మంటగలిపి, తుంగలో దొక్కి కుటుంబి అయినాడు బావుందా?'' అనటంలో నరజన్మ సఫలత పొందుతున్నదని నమ్ముతున్నావు. పరబ్రహ్మణి క్కోపినసక్తం'' అన్నారు జగద్గురువు శంకరులు. వన్ ఆఫ్ ది రిచెస్ట్ శ్రమజీవి అయి నరజన్మమిక దుర్లభమురా అనుకుని సత్‌గురువును దర్శించాడు.

కూచున్నవాడు లేచి ''బావుంది సెర్మన్'' అని వెళ్లిపోయాడు.

''యోగీ! మా అమ్మాయికి నయమౌతుందా? బుద్ధిమంతురాలు, కర్తవ్య పాలన చేసే అమ్మాయి, నెమ్మదైనది, నా వారనే ప్రేమాభిమానాలు గల బిడ్డ వ్యర్థురాలైంది. మునుపటి మనిషినిగా చేయండి. నరజన్మమిక దుర్లభమని తెలియజెప్పండి'' అని లేచి దణ్ణం పెట్టాడు తండ్రి.

''అక్కర్లేదు యోగీ. అనవసరం'' అన్నది రూపసి.

''అక్కర్లేదట. చెప్తున్నదిగా'' అన్నాడు యోగి.

''చాలా కష్టనష్టాలు తెలుస్తున్నది యోగీ. ఉజాడు ఉజాడు చేస్తున్నది. ఆమెకు తెలియకే చేసున్నదంటాడో భూతవైద్యుడు''.

''నేనే కుదుర్చుకోగలను. నీకు శ్రమ యెందుకు యోగీ?'' అన్నది రూపసి నవ్వుతూ.

''విన్నారుగా. పూజనీయురాలు కావాలని లేదు అని తేల్చింది''.

''నా ఐవేజు అంతా నా కోసవే ఖర్చవుతున్నదా? ఆయన కుమారరత్నాలెంతెంత సంపాయిస్తున్నారు? చదువులు ధగధగా వెలిగిస్తున్నారట. కనీసం ట్యూషనన్నా పెట్టుకోవచ్చునే! లేదు. పెళ్లిళ్లు స్థిరపరుస్తున్నాడు తండ్రి. అంటే ఆ వచ్చే కోడళ్ళు గూడా నా ఐవేజు మీదే బతకాలనా? కలవారి బిడ్డ కానీ లేనివాడిని చేసుకుంటుందా? పూజనీయురాల్ని అయినానుగా యోగీ! యెరుకల పూడి తీసికెళ్లి తాళ్లతో బాది తాట వూడదీశాడు. బడిత పూజ చేశారు. మాడు దువ్వి నిమ్మరసం పోసి రుద్ది పొద్దున్నే నలబై బిందెల నీళ్లు వూపిరాడకుండా పోశారు. నీళ్లు తోడి అందించినందుకు కూలీ నా ఐవేజు లోదే. అది చాలక వుప్పుకారం పులుపూ లేని, వుడకపెట్టిన చప్పిడి కూర వేసి తినిపించారు. తిననని మొండికేస్తే చల్ల రసం తాగించారు'' అని చివ్వున లేచింది రూపసి శివాంగి.

''మరి నీ నోటికీ, చేసే పన్లకీ, తెచ్చే నష్టాలకీ హద్దున్నదా శివాంగీ?'' అన్నాడు తండ్రి.

''పోనీ నీకు నచ్చే వైద్యమే చేయిస్తాము. కావల్సిన వే తినచ్చు. వెల్లుల్లి కందిపచ్చడి, యింగువతో పెసరపచ్చడి కమ్మని నూకల నెయ్యి, వెన్న పళ్ల గోంగూర పచ్చడి వాటితో బాటు నీరుల్లి ముక్కలు పెద్దవి కసకసా నమలచ్చు'' అంటున్నాడు యోగి.

''సమ్మతమేనా?'' అనడిగాడు.

''సడేలే యోగీ! అవన్నీ ఆరగించి, ఛస్తున్నా! ఛస్తున్నా అని పెడబొబ్బలు పెట్టి జనాన్ని పోగుచేస్తుంది శివాంగి'' అన్నాడు తండ్రి.

''మరో వైద్యమంటే నిలువుగుడ్లు పెట్టి చూస్తావు. అదేమంటే మెస్మరైజ్ చేస్తున్నానంటావు దొంగ యోగీ! నిగనిగలాడే గడ్డం మీసం తుమ్మెద రెక్కల్లాగా ఆకర్షిస్తున్నాయి. గోపికలు చేరాయే ఆశ్రమంలో. యిల్లు, మగడు, బిడ్డలూ అన్నీ

వదిలి వచ్చారా? సపోజ్ కుదిర్చావనుకుందాం. యెవరికోసం? రత్నమంటి బిడ్డ, జనముద్దయిన కొడుకు పోయె. డబ్బును మంచి నీళ్లలాగా వాడి అందరికీ పోసే మగడు చలా గయా. ఈ ముసిలోడు బిడ్డల్ని సాకాలా నేను? వాళ్లిటు చెంబటు పెట్టరు. ఓ కన్ను నా మీదుంచి యెవరూ రాకుండా కావిలి''. ఇట్టు రేగి కళ్లు పెద్దవై తళ తళ లాడినై. అందుబాటులో వున్న బడితె అందుకున్నది శివాంగి.

''నేనూ చేయగలను బడిత పూజ''

అక్కడున్నవారు చెల్లాచెదురైనారు. యోగి భక్తులొచ్చారు. శివాంగిని వాటేసుకుని ఆయుధం లాగేసి దూరానికి విసిరేశారు.

''అమ్మా! బంగారు బొమ్మా! తల్లీ! నీకు అన్యాయం జరిగింది. దేవుడుకూడా శీతకన్నేశాడు. శాస్త్రి చేతువుగాని, ఆకలి వేళా, పరగడుపుతో చేయలేవు. విందారగించితే సత్తువొస్తుంది. అందరి పనీ బడుదువు గాని. చప్పిడి తిని నాలుక చవి చచ్చింది నీకు. ఒఱ్ఱగా నూరిన పచ్చళ్లు, వూరగాయలు సిద్ధం. గడ్డ పెరుగు. వేడి బిరుసన్నం. విస్తట్లోకి పూలలాంటి అన్నం తోడుతాముర'' అని లాక్కెళ్లారు.

సర్వింగ్ బాగా జరిగింది. చల్లని మంచినీళ్లు పిండివంటలు రెండోసారీ మూడోసారీ గూడా వడ్డించారు. విందు ముగిసింది.

చిరిచాపల మీద శయనించమని, కర్పూర తాంబూలం, సుగంధ వక్కపొడి అందించారు భక్తులు.

అరిటాకు విస్తళ్లు తీసి ఆవుల ముందుంచారు.

నేల శుభ్రం చేశారు. ఆశ్రితులు అనుయాయులూ తామూ కానిచ్చి మామిడి చెట్ల నీడన చాపల మీద మేను వాల్చారు.

నాలుగున్నర వరకు విశ్రాంతి.

కొబ్బరి నీరూ, జామపండు, బొప్పాయి పండు ముక్కలు కలిపి పంచారు దొన్నెల్లో. అయిదయింది.

యోగి ఆశ్రమం ముందు కూచుని నరజన్మమిక దుర్లభమురా అని పాడుతూ ఏక్తారా మీటుతున్నాడు.

''యేమంటారింతకీ? కుదర్చురా? నష్టపెడుతున్నది'' అని వాపోయాడు తండ్రి.

''సత్యమే చెప్పింది శివాంగి. బాగుపడాలనుంటే తానే కుదుర్చుకోగలదట. కాని యెవరి కోసం అంటున్నది. సత్యమేగా. అనవసరం. ఇలాగే బాగున్నదంటున్నది. నష్టమంటారా? ఆమె ఐవేజు వచ్చే గ్రామంలో ఆమె నుంచి ఆమెనే మానేజ్ చేసుకోమనండి. లీవ్ హర్ ఎలోన్'' అన్నాడు యోగి.

''కాని వూళ్లో పార్టీలు కక్షలున్నాయి. యెలా ఒక్కత్తెనూ వదలటం?'' అని బాధ వెల్లడించాడు తండ్రి.

''అదుగో చూశారా? సద్గురు మీద నమ్మకం లేదు. కంటబడుట గదూ. కంటికి కనపడేవే నమ్ముతున్నారు. అన్నీ మన చేతుల్లో వున్నాయంటున్నారు. మనుష్య బలమే గొప్పదంటున్నారు. యేదీ ఆమె భర్తను గానీ బిడ్డను గానీ దీర్ఘాయుష్మంతులుగా చేయలేకపోయారే? ఆమెకూ వైకల్యం రాకుండా ముందు జాగ్రత్త తీసుకోలేదే. దైవ నిర్ణయం ముందు మనమేపాటి అనుకోలేదే. యేమారుస్తున్నారు. శివాంగి అంటున్నట్టు ఆమె ఐవేజు ముట్టుకోకండి. ఇష్టత మీద యిచ్చినదే పుచ్చుకోండి. అపుడే సద్గురువు కనబడతాడు. బి ఆనెస్ట్ విత్ యువర్సెల్ఫ్ అన్నారు మదర్ సుపీరియర్''.

రొటీన్ యిష్టం లేనివారు వంటింట్లో చేరి పాక ప్రావీణ్యత చూపుకున్నారు. ప్రావీణ్యత లేనివారు సాయపడుతున్నారు.

ఒక యువతి వచ్చి యోగికి దణ్ణం పెట్టి పళ్లూ పాలూ ముందుంచింది. ''స్వామీ! యెంతగా మెడిటేట్ చేసినా, స్క్రిప్ట్స్ చదివినా ఒక్క కోరికా తీరలేదు. లోపం చెప్తారా? దిద్దుకుంటాను'' అని వెళ్లి కూచున్నది.

ఏక్తారా కింద వుంచాడు. బాల్యం వదలని బిడ్డని చూసినట్టు చూస్తూ చెప్పాడు. ''పిచ్చి తల్లీ! నీకేది మంచిచేస్తుందో ఆ కోరికే తీరుస్తుంది పరమేశ్వరి.

అనారోగ్యంగా వున్న బిడ్డకు యేమి పెట్టాలో యేమి పెట్టగూడదో తల్లికే తెలుసుగదూ! అలా అన్నమాట. కోరికలూ అందునా మితిమీరినవీ వ్యాధివంటివి. తథాగతుడు కోరికలుండరాదనే చెప్పాడు. మధుమేహమున్న వారికి తీపి సరుకు అందనీయరు. నీవి కొన్ని కోరికలు తీరే వుంటాయి. నీవది గమనించలేదేమో. రామచంద్రుడశ్వమేధం చేసి గుఱ్ఱాన్ని వదిలాడు అంటే పెళ్లాడాడని అర్థం. భార్యా పక్కన వుండాలే యాగానికీ అనుకున్నది సీతాదేవి. ఆ మాటే వాల్మీకి మహర్షితో అంటే '' ఆకాశగమనం'' యిస్తాను, అయోధ్య వెళ్లి చూసిరా తల్లీ'' అన్నాడట. తీరా వెళ్లి చూసే స్వర్ణసీత కంటబడిందట. నేను నీకు యోగదృష్టి యిస్తాను చూడు'' అంటున్నాడు యోగి. చూస్తున్నదమ్మాయి.

''కాశీపట్నం చూడరా బాబూ, గంగానదినీ చూడరా బాబూ'' అన్న రీళ్లు పరుగెత్తుతున్నాయి. ఒక రమణి, ప్రతిభ గలది, శ్రమించింది. మంచితనమూ వాడింది. చిత్రసీమలో అడుగిడి నటీమణి అయింది. ధనమూ ఆర్జించింది. ఒక నిర్మాత దర్శకుడు అయిన సుందరుని పెళ్లాడింది, గెలుస్తున్నది గదూ మతి బోయింది పరిస్థితి. మగాడు మగాడినని ఋజావు చేశాడు. ఆంక్షలు పెట్టి బంగారు పంజరంలో చిలకలాగా చేశాడా రమణిని. ప్రైవెసీ కోల్పోయింది. స్వేచ్ఛ కోల్పోయింది. మనశ్శాంతి కరవై సురకు అలవాటు పడింది. అది వ్యసనమై, అందరితో తగాదా పడింది. విడాకులివ్వనన్నాడు సుందరుడు. కుదరని వ్యాధి పట్టుకోగా, దుడుకు అయి ఆస్పత్రిలో వుంచబడి అదీ పంజరమే అయింది.

టక్కరితనం అత్యాశకు గురిచేస్తుందని వూహించలేక, విద్యావతి డిగ్రీ పొంది గూడా, విదేశాలు చూసివచ్చి గూడా, తనను తాను అదుపుచేసుకోలేక ముద్దుల బిడ్డను, స్వాధీన భర్తనూ వదలి, చాతుర్యం టక్కరితనం సాయపడగా లక్షాధికారిని వశం చేసుకుని పెళ్లాడింది. చిత్రరంగంలో నంబర్ వన్ కావాలని ప్రతిఘటనను పోటీని చవి చూసింది. మరుమరీచికలుంటాయి చిత్రరంగంలో వువ్వెత్తున లేచిన తరంగాలు కొండరాళ్ళమీదపడి తిరిగి సముద్రంలో పడినట్లు, లక్షాధికారికి మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చి కన్నుమూస్తే లీగల్‌బాటిల్‌లో పాల్గొన్నది

నటీమణి. అందినదంతా పోతున్నదని తెలిసి అశాంతికి గురైంది.

అందాల పోటీలో గెలిచి ప్రపంచ సుందరి కిరీటం నెత్తిమీద పెట్టించుకున్న వనిత గ్లేమరుకీ ధనార్జనకీ దగ్గర దోవ చూసి భ్రమలో పడింది. ఆ అడ్డదోవ డిజ్జీ హైట్సుకి తీసికెళ్లింది. పేరు పొందిన హీరోల పక్కన హీరోయిన్ పాత్ర వేసి, యీజీ మనీ మధువులాగా మత్తెక్కించగా ప్రమాదం గుర్తించలేకపోయింది. రెండు చేతులా ఖర్చు చేసి అత్యాధునిక పరికరాలు వాహనం పొంది, స్తోత్ర పాఠకులను నమ్మింది. కోటీశ్వరుని కొడుకును రహస్యంగా పెళ్లాడింది. రెక్కలొచ్చిన కోరికలు యెగిరాయి. నేల విడిచి సాము చేస్తున్నానని అనుకోక, వాస్తవాన్ని గుర్తించక ఆరో అంతస్తు కిటికీ వద్ద నిలబడి, దానికి తలుపులు చువ్వలు లేవని మరిచి, కిందకి చూసింది. జన సందోహం. తూలి కిందపడి, కోరికలిలా చేశాయని అనుకోకముందే విగత జీవి అయింది. హత్యా, ఆత్మ హత్యా అని పత్రికలు అరిచాయి.

ప్రజల ముద్దు బిడ్డ, హార్ట్ బీట్ అని పేరుపొందిన మధ్యవయస్కుడు పెద్ద కోరికకు గురై, ఆకాశమే పరిమితి, ఆకాశంలో కెగరాలని, మద్దతు లాగివేసి మధ్యంతర యెన్నికలు తెచ్చి పొత్తులు పెట్టుకుని గట్టి నమ్మకంతో నిలబడి ప్రాపగాండాకి వెళ్తూ, గెలుపునాశిస్తూ మెజారిటీ వూహిస్తూ పరవశమై, మానవ బాంబు వుంటుందని వూహించలేక, కృతఘ్నుతుంటుందని వూహించక, ప్రాణాలు బలిపెట్టాడు. అవి అమూల్యమైనవి.

తుళ్లిపడింది యువతి. కళ్లు నలుపుకున్నది.

''చాలు గురూ. కోరికలెందుకు తీరవో గ్రహించాను. సద్గురువును కనుగొనటానికే అంకితమౌతాను. నాకేం కావాలో గురువే చూస్తాడు. అపోహ వదిలింది'' అని లేచి తలవంచి దణ్ణం పెట్టింది.

యువకుడు ముందుకొచ్చాడు ''యోగీ! విదేశంలో వుద్యోగం నన్ను గికురిస్తూ పిలుస్తున్నది. ఇక్కడి జాబ్ వదిలి వెళ్లాలా వద్దా అనే మీమాంసలో పడి నిద్రకు వెలి అయి నేనొంటరి అయినాను'' అన్నాడు.

''కూచో నాయనా! పాత రోజుల్లో తలారి వూరి చుట్టూ తిరుగుతూ మేల్కొండీ మేల్కొండీ అని దీపం పైకెత్తి కేకవేసేవాడు. నరగ సంకీర్తన అని జరిపేవారు భక్తులు'' శ్రీ రామనామ మంత్రమె రత్నము దొరకెనూ , నా పామరత్త్వము బాపే నామస్మరణ దొరికెనూ, తెలుపు, నలుపు, యెరుపు రామచిలుక దొరకెనూ, ఆ చిలుకను గూడుటకు సద్గురు సేవ దొరకెను'' అని పాడుతూ వెలుగు రేకలు వచ్చేదాకా తిరిగేవారు. తలారి ఫిలాసపరైతే ''మేలుకొను కర్మానుసారీ। మేలుకొను సంకల్పకారీ। మేలుకొను కారణ శరీరీ। మేలుకొనవే జీవా। మేలుకో । కాని దొంగలు ఆర్గురూనినూ కాచి వున్నారు జీవా మేలుకో। అని పాడేవాడు. దూరస్య పర్వతాకారం బిడ్డా! దూరపు కొండలు నునుపు నాయనా. విదేశంలో మెరమెరలు తళతళలు పోగానే జీవితం అర్ధరహితంగా కనబడి మాతృదేశమే గుర్తు వస్తుంది బిడ్డా. లే ఆఫ్‌లూ, జాబ్ లేకపోవటం, జలగల్లాంటి మనుషులూ మాతృదేశాన్ని గుర్తు చేస్తాయి. బెడ్ సిట్టర్, బేబీ సిట్టర్, బార్బర్ షాపులో, దోబీ షాపులో, కౌంటర్ వద్దా వుండాల్సి వస్తే తలవంపులనుకుని మేధావులు తిరిగి వచ్చేయాలని అనకుంటారు. పరుగెత్తి పాలుతాగే కన్నా కూచుని మంచి నీళ్లు తాగటం మేలని అని అర్ధమై సద్గురు సాక్షాత్కారం కావాలనిపించి, నరజన్మమిక దుర్లభమురా అనే పాట చెవులలో గింగర్లెత్తచ్చు''

యువకుడు లేచి నవ్వుతూ తలూపి దణ్ణం పెట్టి వెళ్లిపోయాడు యువతీ అతన్ని అనుసరించింది.

పొద్దుపోయింది. దీపాలు వెలుగుతున్నాయి. భోజనం వేళైంది. అన్నీ ముగిసి, సద్దుమణిగేప్పటికి రాత్రి పదిన్నరయింది.

తన కోసం లేచి చూస్తూ చాపమీద కూచుని వున్న పండితుని వద్దకు వచ్చి కూచున్నాడు యోగి.

''గురూ. నాకు సెలవిప్పించండి. ఆశ్రమంలో ప్రశాంతత ఆనందం, విశ్రాంతి, రెండుపూటలా యోగాభ్యాసం, యివిగాక వినోదం కలిసి నా అనారోగ్యాన్ని పదిరోజులకే తోలి వేశాయి. గమనికే లేదు గురూ. మరొక జన్మ

యెత్తినట్టున్నది. అంత బలం చేకూరింది. కుతూహలం వల్ల అడుగుతున్నాను'' అని ఆగాడు పండితుడు.

అదంతా గురువు దయ పండిట్ జీ! మీకు యే వ్యాధీ లేదు. పని వత్తిడి వల్ల బడలిపోయారు'' పదిమంది చేసేపని ఒక్కరే చేశారు. మెదడుకీ విశ్రాంతి నివ్వలేదు. వేడెక్కింది. బాధ్యతలూ నెత్తిన వేసుకున్నారు. వరీ. సరస్వతి నారాధించాలి. విద్యా వ్యాప్తి చేయాలి. పరిశోధన మరీ పని కల్పించింది. నియమిత వేళల్లో స్నానం పానం, నిద్రా గూడా పాటించలేదు పండిట్ జీ. చిన్న కథ చెప్తా.

ఒక రాజుండేవాడు. అనారోగ్యమే యెరగడు. అస్థాన వైద్యుడు ప్రజల సేవకే. ఆయన పోయాడు. రాణి తన వేపు వున్న ఆస్థాన వైద్యుని పిలిపించి వుద్యోగమిచ్చింది. ఆయనకు తన ఘనత చూపాలని వుండేది. అవకాశమే రాలేదు. రాజుకి భోజనం వేళ తప్పించమని రాణికి చెప్పాడు వైద్యుడు.

అభ్యంగనం ఆలస్యమైంది. భోజనం వేళ, ఆకలి వేసింది. రాజు నవ్వుతూ తీయగా కలిపివున్న తాజా నలుగుపిండి కంటబడితే అది తిన్నాడు. జబ్బే పడలేదు. పండితుడు రాజు నియమావళి గమనించి సంతోషించి మెచ్చాడు.

ఇంకా వింత కథ. రష్యాకి ప్రజాస్వామ్యం వచ్చింది. ఒక వుద్యోగి జబ్బుపడిగూడా సెలవు పెట్టక, చేయాల్సిన పని పూర్తి చేస్తుంటే తోటి వుద్యోగి చూశాడు. వాడు తమ నాయకుడు లెనిన్‌ని దర్శించి చెప్పాడు. ''శలవు పెట్టమంటే వినటం లేదండీ'' లెనిన్ స్వయంగా వచ్చి నవ్వుతూ మందలించాడు.

''నీవిప్పుడు ప్రభుత్వ సొత్తువి కామ్రేడ్. ప్రభుత్వ సొత్తుని పనికిరానిదిగా చేసి మూల పడేసే హక్కు నీకు లేదు. మెషీన్ పనిచేయకపోతే కార్ఖానాకి తీసికెళ్లి లోపం తెలిసి రిపేర్ చేయించి, ఫిట్ చేసి తెచ్చివాడుకుంటారు. అలాగే నీవూ హాస్పటల్లో అడ్మిట్ అయి ఆరోగ్యవంతుడవై వచ్చి పని పూర్తి చేయాలి. సిక్‌లీవప్పుడు పూర్తి జీతమిస్తారు ప్రభుత్వం'' అని లేవదీసి తీసికెళ్లి అడ్మిట్ చేశాడు. అలాగే మీరూ. ఆరోగ్యాన్ని గురించి శ్రద్ధ తీసుకుంటూ తక్కిన పనులు

పూర్తి చేయాలి.

''బాగా తెలియజెప్పారు యోగీ. చిన్న సందేహం''.

''నివృత్తి చేసుకోండి పండిట్ జీ'' యోగి నవ్వుతున్నాడు.

''సంచారాలు నిలవలేవే. యెలా సమకూరుతున్నాయి?''

''స్వల్ప విషయం పండిట్ జీ, నాద యోగి, నాదబ్రహ్మ త్యాగరాజస్వామి, సంగీతం వ్యాప్తి పొందాలనే ఆశయంతో బాలురకి భోజనం పెట్టి సంగీతం నేర్పేవారట. తగినంత శాస్త్ర జ్ఞానం, సంగీత జ్ఞానం అలవడేవరకు పోనిచ్చేవారు కాదట. ఆనాడు యింట్లో యేమీ లేవు. పొద్దూకే వేళ. చిన్ననాటి గురువూ ఆయన శిష్యులూ అనుయాయులు చూచిపోవాలని వచ్చారట. స్వామి విచారమూ నవ్వు కలిసి'' రాముడు పరీక్ష పెట్టాడు గురూ. అన్నీ నిండుకున్నాయి'' అన్నారట.

''త్యాగూ! అలా అనకు. రాముడు చూస్తూ మిన్నకుండడు'' అన్నాడట గురువు. అదే నిజమైందేమో అన్నట్టు శ్రేష్టి సంచారాలు తెచ్చి వంటింట్లో అమర్చాడు. శిష్యులూ అనుయాయులు అన్నీ వండి సిద్ధం చేసి భోజనాలైనై అనిపించారు. తామూ ఆరగించారు. పొద్దుబోయి పడుకున్నారు. తెల్లారుజామున గురువు తనవారితో బళ్లు యెక్కి వెళ్లిపోయాడు.

తెల్లారింది. అంతా తెలుసుకుని త్యాగరాజు స్వామి, రాముడే తానున్నానని నిరూపించాడని ఆనందించి, ''భవనుతనా హృదయమున రమింపు। భవతారకా। నాతో బాగుగా బల్కితివి'' అని మోహనరాగంలో పాడారుట. అలా పండిట్‌జీ! గురువే సమకూరుస్తున్నాడు'' అని నవ్విస్తున్నాడు. పండితుడు ఆనందంతో నవ్వుతున్నాడు.

ఇంట్లో వున్న వారిని వదిలి ఒక వృద్ధురాలు కర్రపోటు వేసుకుంటూ వచ్చి, అతి కష్టం మీద నేలమీద కూలబడింది.

'' ఇన్ని అలాగ్గా చెప్పుతున్నావే యోగీ! నా సంశయమూ తీరుస్తే నేనూ

పొద్దున్నే వెళ్లిపోవాలి. పొద్దున్నే నా యీడు వారొస్తారు'' అన్నది. బోసినోరూ. ఒక కన్ను పోయింది. చూపు మందగించింది.

''చెప్పగలనేమో చూడాలి మాతా'' అన్నాడు యోగి.

''సదాచారం, కులాచారం, వంశాచారం పాటించాను. ఉపదేశమూ పొందాను. పగలల్లా మడితోనే వుంటాను. వ్రతాలు యాత్రలు చేశాను తప్పిదమెక్కడ జరిగిందో అంతుబట్టలేదు యోగీ. మనమలకీ మతాచారం ప్రకారం సంఘాచార ప్రకారం అన్నీ చేశాను. వారూ పాటించేట్లు చూశాను. కాని యోగీ ఒక్కడూ బాగుపడి వున్నతికి పోకపోగా నన్నే తప్పుపట్టటం నేర్చారు. అనాచారమూ మితిమీరుతున్నది చూస్తుండగానే. పెద్దలనెదిరించరాదనేదీ, దూషించరాదనేదీ కలలో మాట అయింది. డబ్బు గుంజటం నిజమైంది'' అని కొంగుతో కళ్లు అద్దుకున్నది వృద్ధమాత.

''సత్యం చెప్పి యింకా బాధ పెంచుతానేమో మాతాజీ! లక్ష్మి నడిచి వచ్చి వాకిట్లో నిలబడితే గుర్తించలేక, మతమూ, ఆచారమూ పేరిట తరిమేశావు. ఆమె వెన్నుచూపుతూ వెళ్లిపోయింది. వీధి గడపలో నించుని వూసు వింటుండగా పెద్దావిడ వస్తూ కంటబడింది. పనివేళా పిలిచి ఆదరించి లోపలకి తీసికెళ్లావు. గౌరవించావు. పెద్దరికం నిలబెట్టుతున్నావనుకున్నావు. మతం పేరిట, కొట్లాటలు, గుళ్లూ గోపురాలు విగ్రహాలు ఛిన్నాభిన్నం చేయటం, హింసను ప్రోత్సహించటం చిన్న చూపు చూడమనీ మతం చెప్తున్నదా. ఖయ్యామ్ అనే గురువూ ''నాయనా! మత వ్యాప్తి చేస్తున్నామని దండయాత్రలు చేసి స్త్రీలను వెండి బంగారాలను కొల్లగొట్టు కొచ్చి పంచుకోమని మతం నేర్పుతున్నదా. స్నానశాలలో పాఠశాలలో జరిగే అవినీతి గమనిస్తున్నారా? గడప ముందు చడావులుంచి లోపలికి మగవాడు దూరాలని మతాచారం చెప్తున్నదా అంతకన్న సారాయం సేవించి రోడ్డుమీద పడిదొర్లటం మంచి పద్ధతి గదూ. ఆ తాగుమోతు తనకు తను అవమానం కలిగించుకుంటున్నాడు. పరులనవమానించటం లేదే'' అని బోధించాడని దేశ

బహిష్కారం పొందాడు. మతాచారాల వెనక దాక్కుని యిగో పెంచుకునే వారికి మూర్ఖత్వం వుంటుంది. అధికార దాహం పేరు మతం కాదు. ఇల్లూ ఆస్తీ గౌరవ మర్యాదలూ నిలబెడ్తూ కాపాడే కొడుకును నాస్తికుడనీ అవినీతిపరుడనీ అన్నావు పిలిపించుకుంటుంటే, వుద్యోగమూ, భార్యాబిడ్డలనూ, తన ఆరోగ్యాన్ని గూడా లెక్కచేయక గాలికి వదిలి వచ్చి నీముందు వాలాడు. సద్గురువును కనుగొన్నది నీ కొడుకే. మానవతకి తిలోదకాలిస్తే గురువు దర్శన మిస్తాడు. మతం పనిచేస్తుందా? కామక్రోధుడు తపం బొనర్చితే కాచి రక్షించునా అన్నారు త్యాగబ్రహ్మం'' అన్నాడు యోగి.

అలా నడిచింది ఆశ్రమం. వారం, పక్షం, నెల, సంవత్సరం దొర్లిపోయాయి.

పండితుడు యోగి దర్శనం చేసుకోవాలని ఆశించాడు. తన పరిశోధన ఫలించి బిరుదు తెచ్చి యిచ్చింది. ఆస్థాన విద్వాంసుడినైనానని చెప్పుకోవాలని వచ్చాడు. విచిత్రం.

తాను వుండి వెళ్లిన చోట ఆశ్రమమూ లేదు. జన సంచారమూ లేదు. గుర్తులూ లేవు. ఒకరూ యిద్దరూ, గ్రామీణులూ, పల్లెకారులూ మత్స్యకారులూ కంటబడితే అడిగాడు.

''ఇక్కడొక ఆశ్రమముండాలి. దానిలో సచ్చిదానంద యోగి వుండాలి. కలకలలాడుతూ సందడి చేస్తూ అనుయాయులూ, ఆశ్రితులూ భక్తులూ వుండాలే''.

''యేమో బుగతా యెవర్నీ మేము సూడలేదు. నీకు బెమ కలిగిందేమో'' గొఱ్ఱెల కాపరి గొఱ్ఱెలతో వెళ్లిపోయాడు.

''యోగి వస్తూ పోతువుంటాడు బుగతా! ఆయన రాగానే అన్నీ వెలుస్తాయి. గుమిగూడుతారు. యోగికి ఆకాశగమనమొచ్చు బుగతా.

నేడిక్కడుంటే రేపు మరోచోట దర్శనమిస్తాడు నారదమునిలాగా. మళ్లా వస్తాడులే బుగతా నిరాశపడకు. మళ్లా బోధ చేస్తూ నవ్విస్తూ మన మధ్య వుండి గురువుని చూపుతాడు'' పశులకాపరి గోపన్న ఆవులనూ దూడలనూ అదిలించుకుంటూ వెళ్లిపోయాడు.

వినీలాకాశంలోకి చూశాడు పండితుడు. రెండు చేతులెత్తి నమస్కారం చేశాడు.